
ఏటికొప్పాక వైద్యశిబిరంలో పలువురికి బీపీ, ఈసీజీ పరీక్షలు చేస్తున్న సిబ్బంది


చౌడువాడలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం


కుమారపురంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


ఏటికొప్పాక శిబిరంలో బ్లడ్ సుగర్ టెస్టు చేయించుకుంటున్న ఎమ్మెల్యే కన్నబాబు

పేదలకు సంజీవనిలా జగనన్న ఆరోగ్య సురక్ష


వైద్య సిబ్బందికి ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

పాయకరావుపేట : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు సంజీవని వంటిదని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం, ఇంటింటి వైద్య సేవలు, మాతాశిశు సంరక్షణ పథకం, తల్లీ బిడ్డ కార్యక్రమాలు చారిత్రాత్మకమైనవన్నారు. కంటి వెలుగు కార్యక్రమం ద్వారా వేలాది మందికి కంటి ఆపరేషన్లు చేయించారన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకునే విధంగా వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య కిట్లను ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, సర్పంచ్ గారా ఉషశ్రీ ప్రసాద్, ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు సాయిబాబా, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సుభాష్, డాక్టర్ సౌందర్య, డాక్టర్ పి.కావ్య, డాక్టర్ స్వరాజ్యం పాల్గొన్నారు.

కోటవురట్ల: మండలంలో రెండో విడతలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. చౌడువాడ గ్రామంలో శిబిరం నిర్వహించి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో చంద్రశేఖర్ పర్యవేక్షణ చేశారు. ఆయన మాట్లాడుతూ రెండో విడత నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం మే 7వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. 19 గ్రామ సచివాలయాల పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపాలకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.


ఒంపోలు శిబిరంలో పేర్లను నమోదు చేసుకుంటున్న దృశ్యం

కుమారపురంలో వైద్య శిబిరం

పాయకరావుపేట : కుమారపురం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. సుమారు 260 మంది రోగులకు బీపీ, షుగర్, కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధులు, కీళ్లు, కాళ్ల నొప్పులు, స్త్రీ సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన రోగులకు రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కంటి రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి, పలువురికి శస్త్ర చికిత్సలకు సిఫారసు చేశారు. ఎంపీడీవో ఎ.సాంబశివరావు పర్యవేక్షణలో వైద్యులు నవీన, జయలక్ష్మి, కిరణ్‌కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవిందమ్మ, ఈవోపీఆర్‌డీ చంద్రశేఖర్, గ్రామ కార్యదర్శులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఏటికొప్పాకలో 331 మందికి వైద్య పరీక్షలు

యలమంచిలి రూరల్ : ఏటికొప్పాక మేజర్ పంచాయతీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరాలు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే యు.వి.రమణ మూర్తిరాజు (కన్నబాబు) ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే ఈ సందర్భంగా అన్నారు. వైద్య శిబిరాన్ని పరిశీలించిన ఎమ్మెల్యేకు వైద్యులు బ్లడ్ షుగర్ పరీక్షించారు.


వైద్య సేవలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

వైద్యశిబిరం గురించి ప్రజలకు ముందుగానే సమాచారం ఇచ్చి టోకెన్లు ఇవ్వడంతో శిబిరానికి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. రోగులకు ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు, ఇద్దరు ఎంబీబీఎస్ వైద్యులు చికిత్స అందించారు. మొత్తం 331 మంది ఓపీలో తమ పేర్లను నమోదు చేసుకున్నారు. 270 మందికి బ్లడ్ షుగర్ టెస్టులు, 36 మందికి హెచ్‌బీ, 8 మందికి ఈసీజీ, ఇద్దరికి మలేరియా, మరో ఇద్దరికి డెంగ్యూ, 85 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరుగురికి మెరుగైన చికిత్సకోసం ఆరోగ్యశ్రీకి రిఫర్ చేశారు. 24 మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు, 25 మందికి కంటి అద్దాలు అవసరమని నిర్ధారించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. స్పెషలిస్టు వైద్యులు డాక్టర్ నిహారిక, డాక్టర్ పృథ్వీకుమార్, ఎంబీబీఎస్ డాక్టర్లు డీఎంఎన్ సుగుణ, శిరీష, ఎంపీహెచ్‌ఈవోలు శ్రీనివాసరావు, నెహ్రూ, వైద్య సిబ్బంది, వలంటీర్లు సేవలందించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, జెడ్పీటీసీ సంధ్యారాణి, ఎంపీపీ గోవింద్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎర్రయ్యదొర, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు త్రినాథ్, మండల ప్రత్యేకాధికారి చాముండేశ్వరరావు, ఎంపీడీవో అప్పలనాయుడు, తహసీల్దార్ రాణీ అమ్మాజీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు రాము పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఆరోగ్య భరోసా

మునగపాక : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు ఆరోగ్య భరోసా కలుగుతుందని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు అన్నారు. దేశంలోనే ఇటువంటి కార్యక్రమం ఏక్కడా లేదన్నారు. మండలంలోని ఒంపోలు సచివాలయం ప్రాంగణంలో మంగళవారం ఏర్పాటు చేసిన రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. 140 రకాల మందులు అందుబాటులో ఉంటాయన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బొద్దపు శ్రీరామమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, సర్పంచ్ సూరిబాబు,ఎంపీపీ మళ్ల జయలక్ష్మి,జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ,వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, సచివాలయ కన్వీనర్ నరాలశెట్టి సూర్యనారాయణ,పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ద్వారం జానకీరామ్, వెంకటప్పారావు, మండల సచివాలయాల కన్వీనర్ గణేష్, పీఏసీఎస్ చైర్‌పర్సన్ రామ్మోహనరావు, ఎంపీటీసీ బుజ్జి ,వైద్యాధికారి విమలగిరి,ఎంపీడీవో మన్మథరావు,ఈవోఆర్‌డీ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

వైద్య శిబిరం ఎంతో ఉపయోగపడింది...



గతంలో గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షకు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నా. పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు అందజేశారు. శరీరంలో రక్తం తక్కువగా ఉన్నందున ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం పొందాను. 4 శాతం ఉన్న రక్తం నేడు 8 శాతంకు చేరింది. ప్రజల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకుంటున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

– నారిపల్లి లక్ష్మి, ఒంపోలు (మునగపాక మండలం)

క్లుప్తంగా

అరబుపాలెంలో గ్రామసభ

మునగపాక : అరబుపాలెం గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు కోరారు. అరబుపాలెం సచివాలయంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజలు కూడా గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. పంచాయతీ కార్యదర్శి రమణ, సచివాలయ సిబ్బంది సమావేశంలో పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ


మూలపేటలో ఆయుష్మాన్ కార్డులు అందజేస్తున్న సర్పంచ్ గంగప్పలనాయుడు

మునగపాక : ప్రతి ఒక్కరూ ఆయుష్మాన్ భారత్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు కోరారు. మూలపేటలో మంగళవారం వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా ఆయన కార్డులు అందజేశారు. ఆయుష్మాన్ భారత్ కార్డున్న ప్రతి ఒక్కరికీ రూ.5 లక్షల విలువైన ఆరోగ్య బీమా రక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవళిక, ఉప సర్పంచ్ దేవీచంద్ర, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా స్వామివారి తిరువీధి సేవ


రాజాధిరాజ వాహనంపై స్వామివారు

నక్కపల్లి: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉపమాక వేంకటేశ్వర స్వామి రాజాధి రాజ వాహనంపై ఊరేగారు. ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు నిత్యాభిషేకాలు అర్చనలు నిర్వహించారు. రాజాధి రాజవాహనంలో స్వామివారిని, గోదాదేవి అమ్మవారిని పల్లకిలో ఉంచి తిరువీధి సేవ నిర్వహించారు. గోదాదేవి సన్నిధిలో తిరుప్పావై వ్రతంలోను ఉన్న మదగలిత్తన్ ఓడాద తొళ్ళులైయ్యిన్ 18వ పాశురాన్ని విన్నపం చేశారు. అనంతరం తీర్థ గోష్టి ప్రసాద వినియోగం నిర్వహించారు. సాయంత్రం నిత్య కార్యక్రమాలు యధావిధిగా నిర్వహించారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షునిగా వెంకటరావు

మునగపాక : మునగపాక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా టిక్కలి వెంకటరావు నియామకమయ్యారు. ఈ మేరకు పీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు నుంచి నియామక ఉత్తర్వులు అందాయి. పార్టీ నూతన కార్యవర్గాల ఎంపికలో భాగంగా వెంకటరావును మరోసారి మండల పార్టీ అధ్యక్షునిగా నియమించారు.ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన డీసీసీ అధ్యక్షుడు బొడ్డు శ్రీనివాసరావు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కూండ్రపు అప్పారావులకు కృతజ్ఞతలు తెలిపారు.

వాడ్రాపల్లిలో షటిల్ పోటీలు


ఉత్సాహంగా షటిల్ పోటీలు

మునగపాక : ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా పురుషులకు, మహిళలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. వాడ్రాపల్లి సచివాలయ పరిధిలో జరిగిన షటిల్ పోటీలను సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం ద్వారా ఉపాధి,ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. క్రీడలను తిలకించేందుకు స్థానికులు ఆసక్తి చూపిస్తున్నారు.

విద్యుత్ శాఖ ఏఈ పనితీరుకు నిరసన

పాయకరావుపేట : పట్టణంలో గల విద్యుత్ శాఖ ఏఈ పనితీరు సక్రమంగా లేదని, విద్యుత్ మీటర్లు, కనెక్షన్లు కావాలంటే లంచం అడుగుతున్నారని పలువురు విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలో గల పలువురు విద్యుత్ మీటర్లకు, కనెక్షన్లకు దరఖాస్తులు చేసుకున్నవారు రోడ్డు పై బైఠాయించారు. అనంతరం విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట ఏఈకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అవినీతి ఏఈ పై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఏఈ ఎం.నాగేశ్వరరావును సంప్రదించగా తాను ఎవరినీ లంచం అడగలేదని, నిబంధనల ప్రకారం దరఖాస్తులు చేసుకుంటే సకాలంలో మీటర్లు, కనెక్షన్లు ఇవ్వడం జరుగుతుందని అన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరణ


డీవైఎఫ్ఐ,ఎస్ఎఫ్ఐ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం: భారత ప్రజా తంత్ర యువజన సమాఖ్య, భారత విద్యార్థి ఫెడరేషన్ సంఘాల క్యాలెండర్‌ను ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల కరస్పాండెంట్ ప్రసాద్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల కోసం పోరాడే డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐలకు సంబంధించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. గీత కృష్ణ, ఎం.రమణ పాల్గొన్నారు.


యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ క్యాలెండర్‌ను వైఎస్సార్‌సీపీ నాయకుడు కోన లచ్చన్నాయుడు మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీలక్ష్మి, నానాజీ, సుభాషిణీ దేవి, మహిమారావు, ఎం.సూర్యలక్ష్మి, కె.మురళి, జాషువా, సలీం పాల్గొన్నారు.

శాంతియుత ఎన్నికలే లక్ష్యం

అచ్యుతాపురం సీఐ బుచ్చిరాజు



అచ్యుతాపురం : రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారించామని అచ్యుతాపురం సీఐ బుచ్చిరాజు తెలిపారు. అచ్యుతాపురం పోలీస్ స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా ఎవరెవరిపై బైండోవర్ కేసులున్నాయి..?, నేర చరితుల రికార్డులను చూస్తున్నామని తెలిపారు. వివాదాలకు ప్రధాన కారణమైన మద్యంపై పెట్టిన నిఘాలో భాగంగా బెల్టు షాపులు ఎక్కడున్నా దాడులు తప్పవని హెచ్చరించారు. నాటు సారా వండినా, అమ్మినా చర్యలు తప్పవన్నారు. ఈ యేడాది నూతన సంవత్సర వేడుకల్లో ఎటువంటి వివాదాలు జరగలేదని, డిసెంబర్ 31వ తేదీ రాత్రి ఒక్క రోడ్డు ప్రమాదం జరగకపోవడం మంచి పరిణామం అని తెలిపారు. రానున్న పండగ సీజన్‌పై కూడా దృష్టి సారించామని తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎస్ఐ సన్యాసినాయుడు, ప్రసాదరావు తెలిపారు.

7న విశాఖలో బీసీ చైతన్య సభ

అనకాపల్లి: ఈ నెల 7న విశాఖలోని ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా కళాశాల క్రీడా మైదానంలో బీసీ సామాజిక చైతన్య సభ నిర్వహించనున్నట్లు ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కర్రి రామకృష్ణ తెలిపారు. స్థానిక ఉడ్‌పేట బీజేపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనంతరం చైతన్య సభ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలు పడుతున్న ఇబ్బందుల్ని ఆలోచించి 18 రకాల చేతివృత్తులకు మొదటి విడతగా రూ.1300 కోట్లు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. చేతివృత్తులకు, బడుగు బలహీన వర్గాలకు ఆసరాగా ప్రధాని మోదీ ఎన్నో సంక్షేమ పథకాలను దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. విశాఖలో జరిగే బీసీ సభకు జిల్లాలోని బీసీ సోదరులంతా హాజరుకావాల్సిందిగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కంచిపాటి వెంకట సన్యాసిరావు, రాష్ట్ర నాయకుడు అలమండ శ్రీను, పార్టీ అసెంబ్లీ కన్వీనర్ బొడ్డేడ నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఓరిగంటి నాగమణి తదితరులు పాల్గొన్నారు.


చైతన్య సభ గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కర్రి రామకృష్ణ

ఏడుగురికి ఐవోఎల్ శస్త్ర చికిత్సలు

తుమ్మపాల: కంటి సమస్యలతో బాధపడుతున్న నిరుపేదలకు ఉచిత శస్త్ర చికిత్సలు చేసి, మందులు పంపిణీ చేసినట్లు డాక్టర్ కె.మల్లేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని ఏఎంఏవీఎం రోటరీ కంటి ఆస్పత్రిలో 25 మందికి కంటి పరీక్షలు నిర్వహించి వారిలో ఏడుగురికి ఐవోఎల్ ఆపరేషన్లు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కోలుకున్నాక, వారం రోజులకు సరిపడా మందులు అందించి, వారిని ఇళ్లకు చేరవేసినట్లు డాక్టర్ పి.దేవి తెలిపారు.


కంటి ఆపరేషన్ చేయించుకున్న రోగులతో వైద్య సిబ్బంది

కనకమహాలక్ష్మి సారె ఊరేగింపు నేడు

కశింకోట: కశింకోటలో ప్రసిద్ధి చెందిన కనక మహాలక్ష్మి అమ్మవారి సారె ఊరేగింపు బుధవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ భీశెట్టి కుమార్ మంగళవారం తెలిపారు. మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా మహిళలు తయారు చేసిన స్వీట్లు, పండ్లు వగైరా అమ్మవారికి నివేదించి గ్రామ వీధుల్లో ఊరేగింపు జరగనుందన్నారు.

నేడు పెంచిన పింఛన్ల పంపిణీ

యలమంచిలి రూరల్ : మున్సిపాలిటీ,మండల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం పెంచిన వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఉదయం 11.30 గంటలకు స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో ఎమ్మెల్యే కన్నబాబు ప్రారంభిస్తారని ఎంపీడీవో అప్పలనాయుడు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ, చేతివృత్తిదారులకు ఇస్తున్న రూ.2750 పింఛన్‌ను ఈ నెల నుంచి రూ.3000లకు పెంచింది. ఈ నెల 8వ తేదీ వరకు పింఛన్ల పెంపు ఉత్సవాలను పండగ వాతావరణంలో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అధికార యంత్రాంగం పింఛన్ల పంపిణీని చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎస్.రాయవరంలో...

ఎస్.రాయవరం : పెంచిన పింఛన్లు బుధవారం ఎస్.రాయవరం సచివాలయంలో పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు చేతుల మీదుగా పంపిణీ ప్రారంభం జరుగుతోందని ఎంపీడీవో రామచంద్రమూర్తి అన్నారు. ప్రభుత్వం చెప్పిన మాట ప్రకారం విడతల వారిగా పింఛను నగదు పెంచుతూ జనవరితో రూ.3 వేలు చేశారని, ఇప్పుడు ఈ మూడు వేలు నగదు బుధవారం నుంచి గ్రామాల్లో వలంటీర్లు లబ్ధిదారులకు అందజేస్తారని చెప్పారు.

బీసీ సామాజిక చైతన్య సభకు ఆహ్వానం


బాలకృష్ణకు ఆహ్వాన పత్రాన్ని అందిస్తున్న ఓబీసీ మోర్చా ప్రతినిధులు

అనకాపల్లి: జిల్లా కార్మిక శాఖ కమిషనర్ బాలకృష్ణను ఆయన కార్యాలయంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కంచిపాటి వెంకట సన్యాసిరావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 7న జరిగే బీసీ సామాజిక చైతన్య సభకు ఆహ్వాన పత్రం అందించారు. ఆయన వెంట రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్రి రామకృష్ణ, సభ్యుడు కొండబాబు మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా'


తీడలో క్రికెట్ ఆడుతున్న యువకులు

కశింకోట: మండలంలోని తీడ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా క్రికెట్ పోటీలను నిర్వహించారు. తీడ నుంచి రెండు జట్లు, చెరకాం నుంచి ఒక జట్టు పోటీలో పాల్గొన్నారు. కస్నూరుపాలెం పీడీ జి.వీరునాయుడు పోటీలను పర్యవేక్షించారు. బుధవారం కస్నూరుపాలెం హైస్కూల్లో కబడ్డీ, తీడలో వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నారు.

మునగపాకలో పింఛన్ల పంపిణీ రేపు

మునగపాక: మునగపాకలో ఈ నెల 4న వైఎస్సార్ పింఛన్‌ల పంపిణీ జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు తెలిపారు. గతంలో ఉన్న పింఛన్‌లను రూ.3వేలకు పెంచుతూ ఈ జనవరి నుంచి అర్హులైన లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందన్నారు. మునగపాక సచివాలయంలో వలంటీర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా పింఛన్‌ను దఫదఫాలుగా పెంచుతూ వచ్చారన్నారు. కొత్త పింఛన్లను కూడా అదేరోజు అందజేస్తామన్నారు. ఉదయం 10గంటలకు నందీశ్వర తులసీ కళావేదిక ప్రాంగణంలో నిర్వహించే కార్యక్రమానికి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు అతిథిగా హాజరవుతారన్నారు. సర్పంచ్ అప్పారావు, ఎంపీపీ జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, పార్టీ అధికార ప్రతినిధి ఆడారి కాశీబాబు, సచివాలయాల మండల కన్వీనర్ గణేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ కనకలక్ష్మి అప్పారావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు

ఈవీఎంల పనితీరుపై అవగాహన

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో మంగళవారం అధికారులు ఈవీఎంలపై అవగాహన కల్పించారు. కట్టుబోలు, దిమిలి, మురకాడ, మర్రిపాలెం గ్రామాల్లో డీటీ శేషు, ఆర్ఐ రవికుమార్, వీఆర్వోలు జగన్నాథరావు, సత్యన్నారాయణ, బషీర్‌లు ఈవీఎంల పనితీరును వివరించారు. ఆర్ఐ రవికుమార్ ఈవీఎం ద్వారా ఎలా ఓటు వేయాలో వివరించారు. పలువురు ఈవీఎం ద్వారా ఓటు వేసి సంతృప్తి చెందారు. ఈవీఎంలపై అపోహలొద్దని అధికారులు సూచించారు. కార్యక్రమంలో పలువురు వీఎల్‌వోలు, వీఆర్ఏలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కట్టుబోలులో ఈవీఎంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సంక్షేమ పథకాలు వినియోగించుకోండి..

ఎస్.రాయవరం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరూ సద్వినియోగపరచుకోవాలని ఎంపీడీవో రామచంద్రమూర్తి అన్నారు. భీమవరం, సైతారుపేట గ్రామాల్లో మంగళవారం వికసిత్ భారత్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులతో మాట్లాడి సమాధానాలను నమోదు చేసుకున్నారు. సంక్షేమ పథకాలు సద్వినియోగం తీరుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీనివాస్‌రావు, ఈవోపీఆర్డీ సత్యనారాయణ పాల్గొన్నారు.

వామనావతారంలో వేంకటేశుడు

కశింకోట: స్థానిక గవరపేటలో ఉన్న వేంకటేశ్వరస్వామి మంగళవారం భక్తులకు వామనావతారంలో దర్శనమిచ్చారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా విష్ణుమూర్తి దశావతారాల్లో ఒకటైన వామనావతారంలో స్వామివారిని అలంకరించి పూజలు చేశారు. తిరుప్పావై పాశుర విన్నపం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ వ్యవస్థాపక ధర్మకర్త భీశెట్టి దుర్గానాగేశ్వరరావు, అర్చకుడు సుబ్రహ్మణ్యంల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.



సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
7331100207, 7997958344

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాయకరావుపేట డివిజన్:
9951602901
Office mail : sakshiadvtvsp@gmail.com